# అర్జున్ రెగ్యులర్ బెయిల్‌పై ముగిసిన విచారణ

## జనవరి 3కు తీర్పు వాయిదా

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘట నలో నిందితుడుగా వున్న టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్ ఇచ్చే విషయమై నాంపల్లి కోర్టులో విచారణ ముగిసింది. ఈ కేసులో అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్టుచేసి ఒకరోజు జైల్లో ఉంచడం, ఆ తరువాత హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో విడుదల వడం తెలిసిందే. ఇదే విషయమై రెగ్యులర్ బెయిల్ కోసం నాంపల్లి కోర్టులో ప్రయత్నించాలని హైకోర్టు ఆదేశించడం విదితమే. దీనిపై నాంపల్లి కోర్టులో ఇప్పటికే ఒకసారి విచారణ జరగగా సోమవారం మరోసారి అటు పోలీసు, ఇటు అల్లు అర్జున్ తరపున వాదనలు జరిగాయి. సంధ్య థియేటర్ తొక్కిస లాట ఘటనలో అల్లు అర్జున్‌కు సంబంధం లేదని, ఈ కేసులో ఆయనపై నమోదు చేసిన బిఎన్ఎస్ 105 సెక్షన్‌ను కొట్టివేయాలని ఆయన తరపు న్యాయవాదులు వాదించారు.

ఈ కేసులో అల్లు అర్జున్‌కు ఇప్పటికే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసినందున నాంపల్లి కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని వారు కోరారు.

అయితే అల్లు అర్జున్ తరపు న్యాయవాదుల వాదనలతో పబ్లిక్ ప్రాసిక్యూటర్ విభేదించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాటలో అల్లు అర్జున్ నిందితుడని, ఆయన వల్లే తొక్కిసలాట ఘటన జరిగిందని, పోలీసుల మాటలు ఆయన వినివుంటే ఈ ఘటనే జరిగి ఉండేది కాదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. ఈ కేసులో అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయకూడదని ఆయన వాదించారు. ఇరువర్గాల వాదనలు విన్న తరువాత న్యాయమూర్తి దీనిపై తీర్పును జనవరి 3వతేదీకి వాయిదా వేశారు.

# పిఎస్ఎల్‌వి-సి60 సూపర్ సక్సెస్

>> గ్యాలరీ నుంచి కేరింతలతో రాకెట్ ప్రయోగాన్ని తిలకించారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రతిష్టాత్మకంగా స్పేడెక్స్ మిషన్ ప్రయోగం చేపట్టింది. నింగిలోకి దూసుకెళ్లిన పిఎస్ఎల్‌వి-సి60 రాకెట్ సుమారు 15 నిమిషాల వ్యవధిలో స్పేడెక్స్-బి ఉపగ్రహాన్ని భూమికి 470 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలో 55 డిగ్రీల కోణంలో ప్రవేశపెట్టింది. అనంతరం మూడు సెకన్ల వ్యవధిలోనే స్పేడెక్స్-ఎ ఉపగ్రహం కక్ష్యలోకి చేరింది. ప్రయోగ సమయంలో ఛేజర్ మరియు టార్గెట్ ఉపగ్రహాల మధ్య తక్కువ దూరం ఉంచి అనంతరం శాస్త్రవేత్తల పరిశోధనలు ఈ ఉపగ్రహాల కదలికల ద్వారా చివరికి ఒక్కచోటకు చేర్చడం ఈ ప్రక్రియలో భాగమవుతుంది. 10 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో మొదలై దశలవారీగా రెండు ఉపగ్రహాలు ఒక దానికొకటి దగ్గరగా వచ్చి అనుసంధానం అయ్యేందుకు ఇస్రో భూకేంద్రాల నుంచి పరిశోధనలు చేస్తారు.

ఈ అనుసంధానం తర్వాత విద్యుత్ ప్రసారాన్ని కొనసాగించి మళ్లీ విడిపోయి, మళ్లీ కలుసుకోవడం అనేది ఇంకో ప్రక్రియ అందుకనే ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ఈ పరిశోధన గురించి మాట్లాడుతూ ఒకటి లేదా అంతకుమించిన సార్లు అంతరిక్షంలో ఉపగ్రహాలు అనుసంధానం చేస్తామని ప్రకటించారు. ఈ డాకింగ్ ప్రక్రియ ప్రపంచంలో ఇంతకుముందు అమెరికా, రష్యా, చైనా దేశాలకు మాత్రమే అందుబాటులో ఉంది. వీటి సరసన భారత సగర్వంగా చేరింది. ఇది భారత అంతరిక్ష పరిశోధనలో అత్యంత సాంకేతిక వ్యవస్థకు ఒక నిదర్శనంగా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఇదిలావుంటే స్పేడెక్స్ ఉపగ్రహాల ప్రయోగం విజయవంతం కాగానే, శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ సెంటర్లో శాస్త్రవేత్తలు ఒకరినొకరు అభినందించుకున్నారు.

**పిఓఇఎం ద్వారా 24 పేలోడ్లు కక్ష్యలోకి..**

పిఎస్ఎల్‌వి-సి60 రాకెట్‌లోని నాలుగవ దశలో అమర్చిన 24 పేలోడ్లు అంతరిక్షంలో వివిధ కక్ష్యలలోకి ప్రవేశించాయి. దీనికి కొంత సమయం పట్టింది. షార్ నుంచి పిఎస్ఎల్‌వి-సి60 ప్రయోగం 99వది కాగా, ఈ ఒక్క రాకెట్ ద్వారా రెండు స్పేడెక్స్ ఉపగ్రహాలు 24 పేలోడ్లను విజయవంతంగా ప్రయోగించారు. ఈ 24లో 14 కీలకమైన ఉపకరణాలు ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందించగా, వివిధ విశ్వవిద్యాలయాలు, స్టార్టప్ సంస్థలు రూపొందించారు. ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలకు చెందిన ఇన్ని ఉపగ్రహాలను ఒకే రాకెట్ మోసుకెళ్లింది.

**పిఎస్ఎల్‌వి అంటేనే సక్సెస్**

పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో సోమవారం జరిగిన రాకెట్ ప్రయోగం 62వది. ఇందులో ఇప్పటికి 29 ప్రయోగాలు విజయవంతం అయ్యాయి. కేవలం రెండు మాత్రమే అపజయం పొందగా, ఒకటి పాక్షిక విజయం సాధించింది. భారత అంతరిక్ష పరిశోధనలో పిఎస్ఎల్‌వి రాకెట్‌కు ఉన్న ప్రత్యేకత అంతా ఇంతా కాదు. అతి త్వరలో జరగనున్న 100వ రాకెట్ ప్రయోగానికి ముందు సోమవారం అద్వితీయ విజయంతో శాస్త్రవేత్తలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అంతరిక్షంలోనే ఉపగ్రహాల అనుసంధానం అనే కీలక పరిశోధన విజయవంతమైతే ఇతర దేశాలకు తాము ఏమాత్రం తక్కువ కాదని నిరూపించుకున్నట్లవుతుంది. అమెరికా, రష్యా, చైనా దేశాల డాకింగ్ సామర్థ్యానికి మన సామర్థ్యం కూడా తోడయింది.

ఈ ప్రయోగంతో భవిష్యత్‌లో ఇస్రో అంతరిక్షంలో ఏర్పాటు చేసే స్పేస్ స్టేషన్ నిర్మాణానికి ఉపగ్రహాల సమూహాన్ని ఒకచోటికి చేర్చేందుకు ఎంతో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. దీనికితోడు చంద్రయాన్-4 ద్వారా చంద్రుని ఉపరితలం నుంచి నమూనాలను భూమికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్న ఇస్రో ఈ డాకింగ్ పరిశోధనను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటుందని చెప్తున్నారు. దశలవారీగా భూ చందమామ కక్ష్యల్లోనూ ఉపగ్రహాలు అనుసంధానమయ్యే రోజు మరెంతో దూరంలో లేదని, కక్ష్యలోని ఉపగ్రహాలకు రిపేర్లు, ఇంధనం నింపడం వంటి వాటికి ఈ డాకింగ్ వ్యవస్థ ఉపయోగపడుతుందని అంటున్నారు.

# 20 లక్షల మంది రైతులకు భరోసా నిల్?

## రైతు భరోసాకు సవాలక్ష ఆంక్షలు

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** అసలే రుణమాఫీ సరిగా రాలేదని ఆవేదన చెందుతున్న రైతులకు, రైతు భరోసా అయినా సరిగ్గా వస్తుందా లేదా అనే దానిపై కలవరం చెందుతున్నారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలపై ఒక పక్క కసరత్తు జరుగుతుండగా, ఇదే సమయంలో విస్తీర్ణ పరిమితి, ఆదాయపు పన్ను, ప్రభుత్వ ఉద్యోగాలు చేసే వారికి రైతు భరోసా చెల్లించబోమని స్పష్టంగా ప్రకటిచింది. ఈ నేపథ్యంలో రైతుల్లో ఆందోళన అంతకంతకూ పెరుగుతోంది. ఈ పథకం ద్వారా ప్రతీ రైతుకీ సంవత్సరానికి ఎకరానికి రూ.15,000 ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నా రైతులకు చాలా అనుమానాలు కలుగుతున్నాయి. అలాగే భరోసాని కుటుంబంలో ఒక రైతుకే ఇస్తారు అనేది ఒక ప్రచారం జరుగుతోంది. తెలంగాణలో ఎక్కువ కుటుంబాల్లో ఇద్దరు, ముగ్గురు కూడా రైతులు ఉన్నారు. కానీ ఆ కుటుంబంలో ఒకరికే రైతు భరోసా దక్కుతుంది అంటే మిగతా వారు ఏమవ్వాలి? వారు కూడా చేసేది వ్యవసాయమే కదా. వారూ రైతులే కదా. మరి వారిని అనర్హులుగా ప్రభుత్వం నిర్ణయిస్తుందా? అనేది ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం దీనిపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. అలాగే ఏడు ఎకరాల వరకే రైతు భరోసా ఇస్తారు అనేది మరో అంశం. తెలంగాణలో దాదాపు 90 శాతం మంది రైతులకు భూమి 7 ఎకరాల లోపే ఉంది అని ప్రభుత్వం చెబుతోంది.

అందువల్ల రైతు భరోసాని ఏడు ఎకరాల వరకే ఇస్తారా అనేది కూడా తేలాల్సిన అంశం. ఒకవేళ అంతకంటే ఎక్కువ ఎకరాల్లో పంటను సాగుచేస్తున్నా ఏడు ఎకరాల వరకే రైతులు రైతు భరోసాని పొందే పరిస్థితి ఉంటే.. కొంతమంది రైతులు నష్టపోతారనే ప్రచారం ఉంది. దీనిపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లించే రైతులు ఇలా మొత్తంగా తెలంగాణ వ్యాప్తంగా 20 లక్షల మంది రైతులను అనర్హులుగా మిగిలిపోయే ప్రమాదం ఉందనే చర్చ జరుగుతోంది. గరిష్టంగా 45 లక్షల మంది రైతులకే ఈ పథకం కింద మనీ ఇచ్చే ఛాన్స్ ఉందని అంటున్నాయి.

# మతిభ్రమించి మాట్లాడుతోన్న మాజీ మంత్రి కెటిఆర్

## ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** మాజీ మంత్రి కెటిఆర్‌కు మతి భ్రమించి మాట్లాడు తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. సోమవారం సిఎల్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కొత్త యేడాది లోనైనా కెటిఆర్‌కు మంచి బుద్ధి రావాలని యాదగిరిగుట్ట లక్ష్మినరసింహ స్వామిని వేడుకుంటున్న అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కనీసం ప్రతిపక్ష హోదాను నిలబెట్టుకోలే పోతుందన్నారు. అసెంబ్లీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానంపైన మాట్లాడేందుకు ప్రతిపక్షనేత కెసిఆర్ వస్తాడని ఆశించాం, కానీ మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో కెసిఆర్ గతంలో మంత్రిగా కూడా పనిచేశారన్నారు. మన్మోహన్ సంతాప తీర్మానం పైన మాట్లాడేందుకు కెసిఆర్ అసెంబ్లీకి రాకపోవడం దౌర్భగ్యం అన్నారు. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వడంలో మన్మోహన్ సింగ్ పాత్ర ఎంతో ఉందన్నారు. మన్మోహన్‌కు భారత రత్న ఇవ్వాలని కోరడంతో పాటు హైదరాబాద్‌లో విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడం సంతోషం అన్నారు. కొత్త సంవత్సరంలోనైనా బిఆర్ఎస్ పార్టీ తన తీరు మార్చుకుంటుందని ఆశిస్తున్నాం అన్నారు. 2024లో బిఆర్ఎస్ పరిస్థితి గుండా సున్నా అన్నారు. వచ్చే యేడాది బిఆర్ఎస్ పార్టీ సినిమా చూపిస్తామని, ఆ పార్టీ కథ క్లైమాక్స్ వచ్చిందన్నారు. పదేళ్ల పాటు బిసిల గురించి బిఆర్ఎస్ పార్టీ పట్టించుకోలేదన్నారు. బిసిల రిజర్వేషన్లు తగ్గించి వారికి అన్యాయం చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో బిసిలకు రిజర్వేషన్లు పెంచడం కోసమే కులగణన చేపట్టామన్నారు. 2025లో బిఆర్ఎస్ పార్టీ కథ ముగిసినట్లే అన్నారు. కెసిఆర్ ఫామ్ హౌస్ నుంచి బయటకు రాడు, కెటిఆర్ జైలుకు పోతాడు, కవిత బెయిల్ పైన ఉంది, హరీష్ రావు ఆయన దారి ఆయన చూసుకుంటాడు అన్నారు. బిఆర్ఎస్, బిజెపిలు ఒక్కటే అన్నారు.

# మంత్రి సీతక్క చొరవతో కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల ఫైల్‌పై సిఎం సంతకం

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** గిరిజన సంక్షేమశాఖ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న మూడు వేల మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెన్యువల్ చేసింది. రెన్యువల్‌కు సంబంధించిన ఫైలు గత కొంతకాలంగా పెండింగ్ ఉన్న నేపథ్యంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని రెన్యువల్‌పై అసెంబ్లీలోని సిఎం ఛాంబర్‌లో సిఎం రేవంత్ రెడ్డితో మంత్రి సీతక్క చర్చించారు. ఈ రెన్యువల్ అంశాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గిరిజన విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో రెన్యువల్ ఫైల్‌పై వెనువెంటనే సిఎం రేవంత్ రెడ్డి సంతకం చేశారు. గిరిజన సంక్షేమశాఖ విద్యాసంస్థల్లో మూడు వేల మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లను రెన్యువల్ చేసినందుకు మంత్రి సీతక్క సిఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

# తిరుమలలో తెలంగాణ సిఫార్సు లేఖలకు ఆమోదంపై ఎపి సిఎంకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** తిరుమలలో తెలంగాణ భక్తులకు దర్శనం, వసతి కల్పన విషయంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలను పరిగణలోకి తీసుకునేందుకు అంగీకారం తెలిపినందుకుగాను అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తనతో పాటు, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు చేసిన కృషి ఫలించడంతో మంత్రి సురేఖ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రతినిత్యం అశేష భక్తజనంతో విలసిల్లే తిరమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో రాష్ట్ర ప్రజలకు ఊరట లభించినట్లైందని మంత్రి సురేఖ తెలిపారు. తెలంగాణ ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వారానికి ఏవైనా రెండు రోజులు (సోమవారం నుండి గురువారం వరకు) విఐపి బ్రేక్ దర్శనానికి (రూ.500) సంబంధించి రెండు లేఖలు, స్పెషల్ ఎంట్రీ దర్శనానికి (రూ.300) సంబంధించి రెండు లేఖలకు టిటిడి అనుమతి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు మంత్రి సురేఖ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని లేఖలకు అనుమతి స్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఇదే విధంగా ఎల్లవేళలా సహృద్భావ వాతావరణం, సహకారం నెలకొనాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. తిరుమలలో తెలంగాణ భక్తులకు అందిస్తున్న ఈ సౌకర్యాన్ని సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నూతన సంవత్సర కానుకగా మంత్రి సురేఖ అభివర్ణించారు.

# సామాజిక మాధ్యమాల దుష్ప్రభావాలకు పిల్లలు దూరంగా ఉండేలా అవగాహన

**మార్గదర్శకాలతో బుక్‌లెట్ విడుదల చేసిన తెలంగాణ పోలీసు శాఖ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 30:** వీధుల్లో ఆటలు.. స్నేహితులతో ముచ్చట్లు... స్కూల్స్, కాలేజీల్లో సవాసగాళ్లలో చిలిపి తగాదాలు... పంచ్‌లు.. అలకలు.. ఆట పట్టించు కోవడాలు... నిన్నటి తరం బాల్యం గుర్తులు, ఫేస్ బుక్‌లో ఖాతా, ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్, ట్విట్టర్‌లో పోస్టు, స్నాప్‌లో చాట్... ఈ తరం దూకుడు ఇది. ఆధునిక యుగానికి అందివచ్చిన సాంకేతి కతను వినియోగించుకోవాల్సిందే.. కానీ ఆ ఆధునికత ముసుగులో వచ్చిపడుతున్న అసభ్యత, అశ్లీలత...పక్కదారి పట్టించే ఎన్నెన్నో వలలు.. నేటి తరం బాల్యం ఎదుర్కొంటున్న ముప్పులు ఇవి. ప్రతి చేతికో మొబైల్ ఫోన్ ఉంటున్న తరుణంలో ఆ ఫోన్ నుంచే బాల్యాన్ని చిదిమే సేందుకు, పిల్లలను పక్కదారి పట్టించేందుకు అనేకరకమైన యాప్‌లు, వీడియోలు పొంచి ఉంటున్నాయి. విద్యా, ఇతర అవసరాలకు మొబైల్ ఫోన్ పిల్లలకు ఇవ్వడం తప్పనిసరి కావడంతో పిల్లలు తెలియకుండానే సైబర్ ఇక్కట్ల విష విలయంలో చిక్కుకుంటున్నారు. ఆయా యాప్‌ల నుంచి వచ్చే దుష్ప్రభావాల నుంచి పిల్లలను ఎలా రక్షించుకోవాలనే దానిపై తెలంగాణ పోలీసులు ప్రత్యేక బుక్‌లెట్‌ను విడుదల చేశారు. భావితరాలకు సైబర్ భద్రతను అందించేందుకు దానిని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు.. దానిని వినియోగించుకొని మన బిడ్డలను రక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఇప్పుడు ఉంది. మొబైళ్లు, కంప్యూటర్లు ఎలా పని చేస్తాయి. వాటిలోకి సైబర్ మోసాలకు పాల్పడే వారు చొరబడకుండా, వాటి బారిన పిల్లలు పడకుండా ఎలా చూడాలో బుక్‌లెట్‌లోవివరించారు. పిల్లల వయస్సుకు తగినట్లు మార్గదర్శకాలు రూపొందించడం. ఇంటర్నెట్‌ను సురక్షితంగా ఎలా వినియోగించుకోవాలో వివరించడం, మొబైల్స్, కంప్యూటర్లు నిర్ణీత సమయంలోనే వినియోగించుకునేలా చూడడం పిల్లలు తమకు ఎదురైన అనుభవాలను ధైర్యంగా తెలియజేసేలా సూచనలు చేయాల్సి ఉంటుంది. పిల్లలు ఎక్కువ సమయం సామాజిక మాధ్యమాల్లో ఉండడంతో పాటు ఒంటరితనంగా గడుపుతుంటే వారు ఏదో విష వలయంలో చిక్కుకున్నారని గుర్తించాలి. ఎవరైనా అసభ్య సందేశాలు, అశ్లీల వీడియోలు పంపితే వాటిని గుర్తించి స్క్రీన్ షాట్ల రూపంలో భద్రపర్చి సైబర్ ఠాణాల్లో ఫిర్యాదుచేయాలి. పిల్లలు వాటి దుష్ప్రభానికి లోనైతే అవసరమైతే ఉపాధ్యాయులు, కౌన్సెలర్లను సంప్రదించి వారు అందులో నుంచి బయటపడేలా చూడాలి. ఏవిధంగా అడ్డుకోవాలి.ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (గతంలో ట్విట్టర్), యూ ట్యూబ్, స్నాప్ చాట్, ఫేస్‌బుక్ యాప్‌ల ద్వారా అసభ్య, అవాంఛిత సమాచారం చేరకుండా సెట్టింగ్స్‌లో ఎలాంటి మార్పులు చేసుకోవాలో పోలీసులు వివరించారు. ఇతర సెట్టింగ్‌ల్లో మార్పులపైనా సమగ్ర సమాచారం పొందుపర్చారు.పిల్లలు సైబర్ నేరాల బారిన పడితే వారిని ఎలా రక్షించుకోవాలి.. ఏ విధంగా ఫిర్యాదు చేయాలనే దానిపై అందులో ఉపయోగపడే చట్టాలను వివరించారు. ఈ విషయంలో మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదిచవచ్చు లేదా 1930 నెంబర్‌కు డయల్ చేయవచ్చునని పోలీస్ శాఖ తెలిపింది.

# స్కిల్ 'వర్సిటీకి మన్మోహన్ పేరు పెట్టాలి

## తెలంగాణ రావడం వెనుక కీలకంగా వ్యవహరించారు

## అసెంబ్లీలో మన్మోహన్ సేవలను కొనియాడిన సభ్యులు



**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** దివంగత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ పేరును తెలంగాణలోని ది యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ (వైఐఎస్‌యు)కి పెట్టాలని ఎమ్మెల్యేలు సూచించారు. శాసనసభలో సోమవారం మన్మోహన్‌సింగ్ మృతికి సంతాప తీర్మానంపై పలువురు సభ్యులు మాట్లాడారు. కె వెంకటరమణ మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అన్నారు. భారత్ దశ, దశనే మార్చి తనకంటూ ఒక ప్రత్యేకత తెచ్చుకున్నారని చెప్పారు. యువత, రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాల్సిన మహోన్నత వ్యక్తన ప్రశంసించారు. ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఇండియాను గట్టెక్కించి దేశ ఆర్థిక ముఖ చిత్రాన్నే మార్చారన్నారు. పి సబితా ఇంద్రారెడ్డి ప్రసంగిస్తూ సుదీర్ఘ కాలం ప్రజా సంక్షేమం కోసం పాటుపడిన గొప్ప మానవతా వాదని కొనియాడారు. భారత మాత ముద్దుబిడ్డ అయిన ఆయన పేరును రాష్ట్రంలోన స్కిల్ యూనివర్సిటీకి పెట్టాలని కోరారు. కె రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పారదర్శకంగా పరిపాలించారన్నారు. ప్రజా సంక్షేమం, దేశ సమగ్రత కోసం పాటుపడిన మహనీయుడని చెప్పారు. తెలంగాణ చిరకాల వాంఛ అయిన ప్రత్యేక రాష్ట్రానికి ఇచ్చిన ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు బిల్లు లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదేలా చేయడంలో మన్మోహన్‌సింగ్ ముఖ్య పాత్ర పోషించారని వెల్లడించారు.

**మన్మోహన్ వల్లే రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ: జి.వివేక్**



చివరిగా జి వివేక్ మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ ప్రవేశపెట్టిన సంస్కరణలు కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా తయారయ్యిందన్నారు. ప్రధానంగా మూసివేతకు గురైన తెలంగాణలోని రామగుండం ఎరువుల కర్మాగారంకు సంబంధించిన 10 వేల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేశారని చెప్పారు. ఫలితంగా ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ జరిగి సుమారు 5 వేల మందికి ఉద్యోగవకాశాలు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. కీలక నిర్ణయాలతో దేశాన్ని అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకెళ్లారని చెప్పారు.

# జిఐ గుర్తింపు కోసం మరో 10 ఉత్పత్తుల ఎంపిక

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రానికి చెందిన మరో 10 ఉత్పత్తులను భౌగోళిక గుర్తింపు (జీఐ) కోసం దరఖాస్తు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇందుకు వివిధ విభాగాలకు చెందిన ఉత్పత్తులను ఎంపిక చేశారు. వీటిలో హైదరాబాద్ ముత్యాలు, ఆర్మూర్ పసుపు, నారాయణపేట ఆభరణాలు, మెదక్ బాతిక్ పెయింటింగ్స్, నల్లగొండ బంజారా నీడిల్ క్రాఫ్ట్స్, బంజారా ట్రైబల్ జువెలరీతో పాటు, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్శిటీ నుంచి బాలానగర్ సీతాఫలం, నల్లగొండ పిక్లింగ్ మెలోన్, అనబ్షాహీ ద్రాక్ష, ఖమ్మం మిర్చీ ఉన్నాయి. ఆయా ఉత్పత్తులకు సంబంధించిన ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు.

ఇక వరంగల్ చపాటా మిర్చీకి వచ్చే ఏడాది ఏప్రిల్‌లో గుర్తింపు లభించే అవకాశముందని జీఐ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే తెలంగాణలోని 17 ఉత్పత్తులకు జీఐ గుర్తింపు లభించింది. కాగా ఉత్పత్తుల చరిత్ర, వాటి భౌగోళిక మూలాలు, ఖ్యాతి తదితర అంశాల ఆధారంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధీనంలోని కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్, డిజైన్స్ అండ్ ట్రేడ్ మార్క్స్ విభాగం భౌగోళిక గుర్తింపును మంజూరు చేస్తుంది.

ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 1,408 ఉత్పత్తులకు జీఐ కోసం దరఖాస్తు చేయగా, 658 ఉత్పత్తులకు గుర్తింపు లభించింది.

# విఆర్‌ఓల కోసం 9,654 మంది ఆప్షన్‌లను ఆమోదించిన రెవెన్యూ శాఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 30:** క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం త్వరలో అమల్లోకి తీసుకురానున్న విఎల్ఓ (గ్రామస్థాయి అధికారులు) వ్యవస్థలో పనిచేయడానికి పలువురు విఆర్ఓ, విఆర్ఏలు ముందుకొచ్చారు. ఈనెల 24వ తేదీన దీనికి సంబంధించి రెవెన్యూ శాఖ నుంచి ఆప్షన్‌లను ప్రారంభించి 28వ తేదీ వరకు ఈ ఆప్షన్‌లను స్వీకరించింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వానికి 9,654 మంది (గతంలో విఆర్ఓ, విఆర్ఏలుగా) పనిచేసిన వారు తిరిగి రెవెన్యూ వ్యవస్థలోకి రావడానికి ఈ ఆప్షన్‌లు ఇచ్చారు. సంక్రాంతిలోపు వారికి పరీక్ష పెట్టి వారిని రెవెన్యూ వ్యవస్థలోకి ప్రభుత్వం తీసుకోనుంది. ఈ ఆప్షన్‌ల కింద 11,783 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో డూప్లికేట్ అండ్ మల్టీపుల్ ఆప్షన్ కింద డబుల్ ఆప్షన్‌లు రావడంతో అందులో నుంచి 2,065 దరఖాస్తులను రెవెన్యూ శాఖ తిరిస్కరించింది. అనంతరం 9,718 ఆప్షన్‌లను ఆమోదించగా అందులో ఎంప్లాయి ఐడి 21 మంది, మరో 21 మంది సర్టిఫికెట్‌లను సమర్పించకపోవడంతో వారి ఆప్షన్‌లను ప్రభుత్వం తిరస్కరించింది. మిగిలిన 9,654 మంది ఆప్షన్‌లను రెవెన్యూ శాఖ ఆమోదించింది. ఇందులో గతంలో విఆర్ఓలుగా పనిచేసిన వారిలో 3,534 మంది ఆప్షన్‌లు ఇవ్వగా వారిలో డిగ్రీ చేసిన వారు 1,516 మంది, ఇంటర్ చేసిన వారు 1,347 మంది, ఇతరులు 614 మంది ఉన్నారు.

# మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరనిలోటు

## ఒత్తిళ్లు, అవమానాలు ఎదుర్కొని దేశానికి సేవలు అందించారు

## దేశ ప్రజలు ఆయన సేవలను ఎప్పడు మరిచిపోరు

## కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేయడం తగదు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** దేశానికి పది సంవత్సరాల పాటు అనేక ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, అనేక అవమానాలను ఎదుర్కొని సేవలు అందించిన వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని, ఈ విషయాన్ని దేశ ప్రజలెవ్వరూ మర్చిపోరని కేంద్ర మంత్రి కిసన్‌రెడ్డి అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరనిలోటు అన్నారు. తాను కేంద్రమంత్రిగా పదవి చేపట్టిన తర్వాత రాజ్యసభలో అనేకసార్లు మన్మోహన్‌సింగ్ వీల్ చైర్‌లో వచ్చేవారు అని, వారిని కలిసి నమస్కరించుకునే అవకాశం అనేకసార్లు లభించింద న్నారు. మన్మోహన్‌సింగ్ దేశ ప్రజలందరూ గౌరవించుకునే వ్యక్తి. అలాంటి వ్యక్తిపై కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేయడం చాలా సిగ్గుచేటు, అమానవీయం అన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ సంస్కారహీనానికి అద్దం పడుతున్నది అన్నారు. మన్మోహన్‌సింగ్ మరణించారని తెలియగానే వెంటనే ప్రధానమంత్రి ఒక నిర్ణయం తీసుకుందన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయికి ఏవిధంగా అంతిమ సంస్కారాలు నిర్ణయించారో, మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి అదేవిధంగా అంత్యక్రియలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఆ బాధ్యతను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అప్పగించడం జరిగిందన్నారు. అందుకు అనుగుణంగా మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలకు ఏర్పాట్లు జరిగాయన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారక కేంద్రాన్ని నిర్మించినట్లుగానే మన్మోహన్ సింగ్ కూడా స్మారక కేంద్రాన్ని నిర్మించాలని, మన్మోహన్ స్వర్గస్తులైన మూడు గంటల్లోనే నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. గతంలో ట్రస్టుల ద్వారానే స్మారక కేంద్రాలు నిర్మించారు. అదేవిధంగానే ట్రస్టు ఏర్పాటు చేసేందుకు మన్మోహన్‌సింగ్ సతీమణితో మాట్లాడటం జరిగిందన్నారు. ట్రస్టు పేరుతో భూమిని ట్రాన్స్ ఫర్ చేసి స్మారక కేంద్రాన్ని భారత ప్రభుత్వం ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వయంగా మన్మోహన్ కుటుంబ సభ్యులను ఓదార్చడంతో పాటు కేబినెట్ మంత్రులు అంతిమసంస్కార కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో పాల్గొన్నారని అన్నారు.

దేశ మాజీ ప్రధానులందరికీ ఏ నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టారో అదేవిధంగా మన్మోహన్‌సింగ్ స్మారక కట్టడం విషయంలో ప్రధాని మోదీ కేంద్ర ప్రభుత్వం తరఫున నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇటీవల కాలంలో రాహుల్‌గాంధీ ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం, దుందుడుకుతనంతో వ్యవహరించడం, చివరికి బోర్లా పడటం ఆయనకు అలవాటైందన్నారు. మాజీ ప్రధాని పివి నర్సింహారావు పట్ల, కాంగ్రెస్ పార్టీ ట్రబుల్ షూటర్‌గా వ్యవహరించిన ప్రణబ్ ముఖర్జీ పట్ల కాంగ్రెస్ పార్టీ అవమానకరంగా వ్యవహరించిందన్నారు. మన్మోహన్ సింగ్ పట్ల కూడా కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తూ మొసలికన్నీరు కారుస్తోందన్నారు.

# మంత్రి కొండా సురేఖను కలిసి శాన్వి

**హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** భగవద్గీతలోని 700 శ్లోకాలను ఔపోసనపట్టి, తన గాత్ర మాధుర్యంతో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతూ పదిహేనేళ్ల ప్రాయంలోనే జాతీయస్థాయిలో ప్రతిభాపాటవాలు చాటిన శాన్వి జమాల్‌పూర్ తన తల్లిదండ్రులతో కలిసి సోమవారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి సురేఖకు భగవద్గీతలోని పలు శ్లోకాలను వినిపించి, భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. తాను స్వయంగా రచించిన డివైన్ వర్చ్యుస్ ఫర్ ఎటర్నల్ పీస్ పుస్తకాన్ని మంత్రి సురేఖకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన శాన్విని మనసారా అభినందించారు. పదిహేనేళ్ల వయస్సుకే శాన్వి భక్తి, ఆధ్యాత్మిక, రచనా రంగాల్లో తన ప్రతిభాపాటవాలను చాటి, పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవడం గొప్ప విషయమని మంత్రి సురేఖ కొనియాడారు.

